# 22. మహారాజ సమస్య. . .

కపూర్తలా సంస్థానాధీశులు మహరాజా జగత్‌జిత్ సింహజీ వారు వయసుకు పందొమ్మిదేండ్లవారే అయినా సైజుకు మాత్రం మహాకాయులు. మహాకాయులనేకన్నా లంబోదరు లంటే బాగుంటుందని గిట్టనివారు గుసగుస లాడుతూంటారు. కానీ పైకి అనే దమ్ములు మాత్రం ఎవరికీ లేవు.

అయితే, శ్రీవారి సువిశాలమైన బొజ్జ చరిత్రాత్మకమూ, సంస్థానానికే సమస్యాత్మకమూ అయి కూర్చుందో సుదినాన.

సంస్థానాధీశుల బిడ్డలకు పందొమ్మిదేండ్ల ప్రాయం రాగానే, సకల విద్యలూ, ముఖ్యంగా శృంగార విద్యా నైపుణ్యం అలవర్చ జేయటం రాచ సాంప్రదాయం. ఇందుకుగాను ఆరితేరిన గణికలు ఆస్థానంలో కొలువు చేస్తుండేవారు కూడా. శృంగార జీవితంలో వారికి తెలియని అంశంగానీ, విద్యగానీ లేనేలేదు.

కానీ, అంతటి వారికికూడా మహారాజా జగత్‌జిత్ సింహజీవారు కొరకరాని కొయ్యగా, వారి సుప్రసిద్ధమైన బొజ్జ మింగుడు పడనిదిగా తయారయ్యాయి.

ఏమంటే... !

రాచ పరిభాషలో శృంగార విద్య అంటే పాఠాలు చెప్పటం మాత్రమే గాదు. చేసి, చేయించి అనుభవ పూర్వకంగా నేర్పటంకూడా.

కానీ... !

మహారాజా జగత్‌జిత్ సింహజీవారు ఎంత ప్రయత్నించినా, ఎందరెన్ని విధాలుగా సహకరించినా శృంగార క్రీడలో మాత్రం తప్పనిసరిగా విఫలు లవుతుండేవారు.

అందుకు కారణం వారి సుప్రసిద్ధమైన బొజ్జ. దానికితోడు శ్రీవారు అక్షరాలా పందొమ్మిది స్టోన్ల బరువుండేవారు. శ్రీవారు పడుకోబోతే ఆ మహత్తరమైన బొజ్జ అడ్డం వస్తుండేది.

చివరకు అదొక సంస్థాన సమస్యగా, దాని పరిష్కారం రాజోద్యోగుల అర్జంటు బాధ్యతగా తయారై కూర్చుంది.

లాహోర్, లక్నో, కలకత్తా వంటి మహానగరాల నుండి సెక్సు విద్యలో తలనెరిసిన మహా మహా గణిక లెందరో తమ శిష్యరాండ్రతో సహా విచ్చేసి సకల ప్రయత్నాలూ చేసేరు. చేసి, చేసి అలసిపోయేరు తప్ప సమస్యమాత్రం అలాగే అపరిష్కృతంగా మిగిలిపోయింది. శ్రీవారి చేత ఎన్నో రకాల భంగిమలలో శృంగార క్రీడ చేయించాలని ప్రయత్నించినా ఫలితం లేకపోయింది.

శ్రీవారి బొజ్జ ప్రతి ప్రయత్నానికి అడ్డం తగుల్తోంది. అయితే ఆ బొజ్జను అదుపులోకి తెమ్మనే సలహా మాత్రం ఎవరూ ఇవ్వలేక పోయేరు. శ్రీవారు అన్నపానాదులు తగ్గించి, ఆ భోజనం పడుకుని, వ్యాయామం చేస్తూ బొజ్జ తగ్గించుకోవాలంటే ఎంత కష్టం? ఎంత కష్టం? శ్రీవారా కష్టాన్ని సహించగలరా? ఆకలిని భరించ గలరా?

కనుక, ఆ ఆలోచన మాత్రం ఎవరికీ రాలేదు?

ఇలా ఉండగా, ఉండగా మున్నాజాన్ అనే వేశ్యామాతకు ఓ అద్భుతమైన ఆలోచన తట్టింది.

ఏనుగులు కూడా దాదాపు మహారాజా జగత్‌జిత్ సింహజీ వారి సైజులోనే ఉంటాయ్! వాటికున్న బొజ్జలు శ్రీవారి బొజ్జకన్నా ఏమంత పెద్దవికావు కూడా. మహా అయితే బరువు విషయంలో మాత్రం గజ రాజులు మహారాజుకన్నా కాస్త ఎక్కువేమో!

అందుకని, ఆవిడ తక్షణం మహారాజావారి గజశాలాధ్యక్షుడిని పిలిపించింది. ఏనుగుల సెక్సు అలవాట్లను గురించి సమస్త వివరాలూ సేకరించింది. స్వయంగా కొన్నిరోజులు గజశాలవద్ద గడిపి, గజ సంభో గాల్ని చూసి అర్థం చేసుకుంది.

ఆ తర్వాత...?

దొరికావురా మిడతంబొట్లూ అన్నట్టుగా ఆవిడ అక్షరాలా ఎగిరి గంతేసింది. మహారాజావారి సమస్య, చరిత్రాత్మకమైన సంస్థాన సమస్య తీరిపోయినట్లే భావించింది.

మరు క్షణం సంస్థానపు ఛీఫ్‌ఇంజనీరుగా పనిచేస్తున్న ఆంగ్లేయుడు మిస్టర్ ఎల్మోర్ రాజ సన్నిధికి రప్పించ బడ్డాడు. మున్నాజాన్ సూచ నల మేరకు అతడుమహారాజా వారికోసం చరిత్రాత్మకమైన, శయ్యా నొక దానిని డిజైన్ చేసేడు. కొయ్య, ఇనుము, స్ప్రింగులు వాడి వారంరోజు లలో మంచాన్ని సిద్ధంచేశాడు. అది అసాధారణమైనది. మానవ మాత్రు డెవడూ ఊహించి ఉండనిది. మహారాజావారికీ, వారి ఎనుగులకూ తప్ప మరెవరికీ పనికిరానిది.

ఓ శుభ ముహూర్తాన మహారాజావారు ఆస్థాన పురోహితుల ఆశీ స్సుల నందుకుని ఆ మంచంఉన్న శోభనం గదిలోకి మున్నాజాన్, ఆవిడ తాలూకు అప్సరల్లాంటి శిష్యురాళ్ళూ వెంటరాగా ప్రయోగార్థం ప్రవేశించేరు.

బయట సద్బ్రాహ్మలు వేదపఠనం చేస్తుండగా, ఆలయాల్లో మహా రాజావారి విజయంకోసం పూజలు, ప్రార్థనలు జరుగుతూండగా, సంస్థానో ద్యోగులు, రాజబంధువులు మందిరం వెలుపల ఆత్రుతతో ఎదురు తెన్నులు చూస్తుండగా శ్రీవారు మున్నా జాన్ శిమ్యరాంద్రతో చరిత్రాత్మక ప్రయో గాలు ప్రారంభించేరు.

కొద్ది గంటలలోనే శ్రీవారు తమ ప్రయత్నంలో సఫలులయారనీ జీవితంలో తొలిసారిగా స్త్రీ సుఖం పొందారనీ తెలియగానే అందరూ పెద్ద బరువు దిగిపోయినట్లు ఊపిరి పీల్చుకున్నారు.

ఆ మర్నాడే శ్రీవారు మహారాణీ సమేతంగా, సదరు మంచం సహితంగా హానీమూన్‌కు తరలివెళ్ళేరు. మరి తొమ్మిది నెలలకు మహా రాణీవారు సంస్థానాధీశుడు కానున్న పండంటి, మహారాజంటి పసివాడిని శ్రీవారికి ప్రసాదించింది.

అందుకుగాను సంస్థానమంతటా వారం రోజులపాటు ఆనందోత్స వాలకు ఆజ్ఞలివ్వబడ్డాయి. ఖజానాలోని ధనం విరివిగా ఖర్చుపెట్టబడింది.

ఈ ప్రయోగ పర్యవసానంగా ఉద్భవించిన సదరు బాలుడే ఆ తర్వాత కాలంలో మహారాజా పరంజిత్ సింహజీ అనే పేర శృంగార పురుషుడుగా సుప్రసిద్ధులైన కపూర్తలా సంస్థానాదీశుడు.

★